క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహ మూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవాని పాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మోర్లవారిపాలెంలో పశువైద్యశిబిరం

రేపల్లె రూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీ ఆవరణంలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ తిరుపతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బర్లంక పశువైద్యాధికారి పి.మీనాక్షిదేవి 97 పశువులకు టీకాలు వేసి వైద్యసేవలు అందించారు. పశుయజమానులకు ఉచితంగా మందులను పంపిణీ చేసి వేసవిలో పశువులను కాపాడుకునేందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో సూరేపల్లి విద్యార్థుల సత్తా



సూరేపల్లి(భట్టిప్రోలు): శ్రీ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 6,8 తరగతులు చదువుతున్న వై.అఖిలేశ్వరి, టి.శ్రీవల్లిలు స్వర్ణ, 6వ తరగతి చదువుతున్న వై.జస్వంత్ కుమార్ రజిత, 7, 10 తరగతుల విద్యార్థులు బి.రాజ్యలక్ష్మి, వి.గోకుల్ సాయిలు కాంస్య పతకాలను సాధించారు. నిర్వాహకులు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ పి.నరసింహారావు, ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు రమణారావు, హెచ్‌ఎం కె.శ్రీనివాస శర్మలు అభినందించారు.

కాశీ విశ్వేశ్వరునికి లక్ష గరిక పూజ

బోలాయపాలెం(కర్లపాలెం): అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. బోలాయపాలెం గ్రామంలో వేంచేసియున్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మంగళవారం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రహోమం, లక్షగరిక అర్చన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో స్వామివారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కర్లపాలెం సెంటర్‌లో సీసీ కెమెరాలు

కర్లపాలెం: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కర్లపాలెం సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య తెలిపారు. మంగళవారం కర్లపాలెం సెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివయ్య మాట్లాడుతూ బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో సెంటర్‌లో మొత్తం 6 కెమేరాలు పెడుతున్నామని ఆయన తెలిపారు. రాత్రిపూట కూడా అత్యంత స్పష్టంగా ఈ కెమెరాలు పనిచేస్తాయని ఎస్‌ఐ తెలిపారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

తెనాలి రూరల్: జాతీయ లోక్ అదాలత్ మే 13వ తేదీ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కుటుంబ కలహాలు, వినియోగదారుల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. తెనాలి కోర్టుల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అదాలత్ జరుగుతుందని జడ్జి చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి అర్బన్: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని తిరుపతమ్మ గుడి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్యవైశ్య లీగల్ సెల్ చైర్మన్ దర్శి శివకోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్లు మద్దాలి శేషాచలం, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, నాయకులు వంకదార శివసుధాకర్, మాలేపాటి తిరుమలేశ్వరరావు, సీవీ రమణ, వెచ్చా నాగరాజారావు, కోలా గురునాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- గుళ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: కడుపులోని బిడ్డ నుంచి పండు ముసలి వారి వరకు వారి అర్హతను బట్టి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి సచివాయ పరిధిలో నాల్గో రోజు మంగళవారం ఎంపీ మోపిదేవి నాయకులు, అధికారులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా అర్హత ఉండి పథకాలు రావటం లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లోని సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని చెప్పారు. గత ప్రభుత్వంలో ఏ చిన్న సర్టిఫికెట్ పొందాలన్నా రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి గ్రామంలో సచివాలయాన్ని, అందులో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎక్కడా కూడా అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చక చకా పూర్తి అవుతున్నాయన్నారు. ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, జడ్పీటీసీ మరివాడ పావని, స్థానిక సర్పంచ్ చెన్ను శివమ్మ, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, కామినేని కోటేశ్వరరావు, తూము కోటేశ్వరరావు, చీరాల వెంకటేశ్వరరెడ్డి, మరివాడ ప్రసాద్, తెరిమెళ్ల శ్రీధర్, బండారు రామారావు, కూరేటి శ్రీనివాసరావు, మేత్రా పాములు, లక్ష్మీ నర్సు, కొతరపు గణేష్, ఉల్లంగుంట రామారావు, బొర్రా సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి నమ్మకం జగనన్నే



పిట్టువారిపాలెంలో స్టిక్కర్లు అంటిస్తున్న మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి



విశ్వేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న మండల అధ్యక్షుడు గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ నాగమల్లేశ్వరరావు

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

పిట్టలవానిపాలెం: సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన రాష్ట్ర ప్రజలందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి సూచనలతో పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం, పిట్టువారిపాలెం గ్రామాలలో సర్పంచి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి, మండలపరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, గ్రామ సర్పంచి వైఎస్సార్ సీపీ నాయకులు కుంతం ప్రసన్నరాజు, కూసంపూడి దేవేంద్రరాజుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ రూ.లక్షల లబ్ధి చేకూరిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వలంటీర్‌లు, గృహసారథులు, వార్డు, సచివాలయ కన్వీనర్‌లు ఉన్నారు.

రేపల్లెలో...

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలో జగనన్న మా భవిష్యత్ -మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం 12వ రోజు ఉత్సాహంగా జరిగింది. పట్టణం, పంచాయతీలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, సచివాలయాల కన్వీనర్‌లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్తూ గత నాలుగు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 3వవార్డులో కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, 12వవార్డులో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ మీసాల మణిశ్రీ, 25వవార్డులో కౌన్సిలర్ షేక్ ఆస్వానాలు, మండలంలోని బోడాయపాలెం, విశ్వేశ్వరంలో గ్రామాలలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్‌లు మాతంగి రవి, కరి నాగమల్లేశ్వరరావులు, పెనుమూడిలో సర్పంచ్ దారం విజయ్, తదితరులు ఇంటింటికి పర్యటించి జగనన్న స్టికర్‌లను అందజేశారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలు సచివాలయాలతో పాటు వివిధ గ్రామాల్లో సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. మంగళవారం ఐలవరం సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, గ్రామ కన్వీనర్ మాచర్ల తులసి రంగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో సచివాలయ కన్వీనర్ నీలా నాగరాజు, భట్టిప్రోలు-1, 2 సచివాలయాల పధిలో జరిగిన కార్యక్రమాలలో పీజీ అరుణ్ శాస్త్రి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి) పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ గోడౌన్ వద్ద మంటలను అదుపు చేసే ప్రక్రియను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



బాపట్లలో పెట్రోల్‌బంక్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేపల్లె: ప్రతి ఒక్కరికీ అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలని ఫైర్ ఆఫీసర్ సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అరవపల్లి రహదారిలోని గ్యాసు గోడౌన్ వద్ద, పెనుమూడి రహదారిలోని పెట్రోలు బంకు వద్ద మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్రోలు బంకుల వద్ద పొగ తాగడం, సెల్‌ఫోన్ మాట్లాడటం వంటి చర్యలు చేయరాదన్నారు. ధూమపానం చేసినా, సెల్‌ఫోన్ మాట్లాడినా ఫలితంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ గోడౌన్‌ల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ వైర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో..

బాపట్లటౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని గ్యాస్ గోడౌన్లు, పెట్రోలు బంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్లు, గ్యారేజీల్లోని సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుడు కుటుంబరావుకు సన్మానం



కుటుంబరావును సన్మానిస్తున్న నారాయణప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం భట్టివిక్రమార్క చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం నర్తనశాల చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు బోడేపూడి కుటుంబరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాఖమూరి నారాయణప్రసాద్, సోమవరపు నాగేశ్వరరావు, చుక్కపల్లి వెంకట సాంబశివరావు, పెదబాబు, ఫణీదపు దుర్గ, రావిపాటి ప్రసాద్, పెమ్మసానీ పోతురాజు, రావి సూర్య కిరణ్‌తేజ, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, దాసరి నరసయ్య, కాశేవ్వరరావు, నరసింహారావు, పి.రాజు, డి.పోతురాజు, వీరశేఖర రావు, ప్రసాదరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీలో హీమోఫీలియా దినం

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్‌ఎన్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం హీమోఫీలియా దినాన్ని నిర్వహించారు. హీమోఫీలియా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను డాక్టర్ గుర్రం ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రొఫెసర్ డి.జ్యోతిబసు, వి.కోటిరెడ్డి, వై.ఫణీకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి



వేమూరు: పెండింగ్ కేసులన్నీ త్వరతగతిన పరిష్కరించాలని రేపల్లె డీఎస్పీ మురళీ కృష్ణ తెలిపారు. వేమూరు సీఐ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బైక్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు. పోలీసు యంత్రాంగం కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. సీఐ వెంకటేశ్వర్లు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు ఎస్‌ఐలు, రైటర్లు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నగరం: మండలంలోని బెల్లంవారిపాలెం, బోరమాదిగపల్లి, ఏలేటిపాలెం, ధూళిపూడి, అద్దంకివారిపాలెం, కొలగానివారిపాలెం, పమిడిమర్రు, చిరకాలవారిపాలెం గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లితుందని ఏఈ ఎండీ నాగులమీరా చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉల్లిపాలెం సబ్‌స్టేషన్ నుంచి ధూళిపూడి ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈగ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈవిషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

రీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలి

రేపల్లె: భూముల రీసర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ ఆర్డీ శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భూముల రీసర్వే కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమం ద్వారా భూపరమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి గురువారెడ్డి, మున్సిపల్ రీజనల్ అధికారి మధుకుమార్, కమిషనర్ విజయసారధి, అధికారులు సుబ్బారావు, స్రవంతి, కోటేశ్వరరావు తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం

తెనాలి రూరల్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం.. ఐతానగర్‌కు చెందిన 57 ఏళ్ల మల్లపురం గోవిందు కూలి పనులకు వెళుతుంటాడు. ఈ నెల 10వ తేదీన రైల్వే స్టేషన్ ప్రాంతానికి వచ్చి కనబడకుండ వెళ్లిపోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు ఆంజనేయులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

రేపల్లె రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మండలంలోని ప్రజలకు తాగునీటిని పంపిణీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించి గ్రామాలలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించటంతో పాటు తాగునీటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేట్టనున్నామన్నారు. గ్రామాలలో అవసరమైన ప్రదేశాలలో చేతిపంపులను ఏర్పాటు చేయాలని, చేతిపంపులు మరమ్మతులకు గురైతే వెంటనే మరమ్మతులు నిర్వహించాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనంతరం ఏజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీపీ పెనుమాల సుశీల, మండల ఉపాధ్యక్షులు పీతా వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే కోన ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును అందజేశారు. తొలుత మసీదులో ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, పార్టీ నాయకుడు మునీర్‌లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌ను స్వీకరించారు. చందోలు నుంచి పిట్టలవానిపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో గల మసీదులకు ఇఫ్తార్ భోజనం పంపించి, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండలంలోని నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టలమ్మను దర్శించుకున్న చీఫ్ విప్ ఉమ్మారెడ్డి



శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును సన్మానించిన సర్పంచి భానుప్రసాద్

యాజలి(కర్లపాలెం): శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మంగళవారం యాజలి గ్రామదేవత పుట్టలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పుట్టలమ్మ అమ్మవారికి ఇటీవల కొలుపులు జరిగిన నేపథ్యంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచి నాదెండ్ల భానుప్రసాద్, బాపట్ల కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫాను అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 25వ వార్డు కౌన్సిలర్ షేక్ అస్వానా జమీర్‌ల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన రంజాన్‌తోఫాను మంగళవారం స్థానిక వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రంజాన్‌మాసంలో ముస్లింలు నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు ఉండి, ప్రవక్త చెప్పిన సూత్రాలను అవలంబిస్తూ అల్లాకు చేరువకాగలరన్నారు. రంజాన్‌ను పేద ముస్లింలు సైతం ఆనందంగా జరుపుకొనేలా కౌన్సిలర్ అస్వానా జమీర్‌లు నిత్యవసర వస్తువులు అందించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 300 మందికి బియ్యం, నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ మోపిదేవి..

నగరం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని చినమట్లపూడి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ముస్లిం యూత్ నాయకులు ఎంపీ మోపిదేవిని పూలదండలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం



పెదపులుగువారిపాలెం గ్రామ పెద్దలకు నగదు అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: గ్రామదేవతల కొలుపులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. పెదపులుగువారిపాలెం గ్రామ పెద్దలు మంగళవారం ఎమ్మెల్యే కోన రఘుపతిని కలసి ఈనెల 22న జరగనున్న పులుగువారి ఇలవేల్పయిన గ్రామదేవతలు బురకాయలంకమ్మ, వీర్లంకమ్మ అమ్మవార్ల కొలుపులు నిర్వహిస్తున్నామని కొలుపులకు రావాలని ఆహ్వానించారు. ఈనెల 23న ఆలయం వద్ద అన్న సంతర్పణ చేస్తామని తెలిపారు. అమ్మవార్ల ఆలయం వద్ద నిర్మించనున్న కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చేయూతనందించమని గ్రామ పెద్దలు అడుగగా ఎమ్మెల్యే కోన రఘుపతి రూ.50వేలు నగదును గ్రామపెద్దలకు అందజేశారు. గ్రామ సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, పెద్దలు పులుగు ఆదిరెడ్డి, అక్కల వెంకటేశ్వరరెడ్డి, పులుగు వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చి ప్రథమ వార్షికోత్సవం



ప్రత్యేక ప్రార్థనలో థామస్, భక్తులు

బాపట్ల అర్బన్: స్థానిక సాల్వేషన్ ఆర్మీ విద్యానగర్ కోర్ ప్రార్థనా మందిరం ప్రథమ వార్షికోత్సవ ఆరాధన మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో ఆరాధనలో పాల్గొని దేవుని దీవెనలు పొందారు. ముఖ్యఅతిథిగా లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్, డివిజనల్ కమాండర్ గేరా సీయోస్ కుమారి దైవ వర్తమానము అందించారు. మేజర్ ఎం.రమణ, మేజర్ ఎం.ఆనంద్ కుమార్, కె.బాబు రావు, కె.వరప్రసాదరావు, జీఏ మణి భూషణం, ధనకుమార్, సంఘ పెద్దలు వై.సూర్య ప్రకాష్, తుమాటి విజయకుమార్, జి.ప్రసాదరావు, కె.శ్యామ్‌రాజు, గృహ సమితి మహిళలు, యవ్వనస్తులు, సండే స్కూల్ బాలబాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎంఈఓ లక్ష్మీనారాయణ



విజేతలకు కప్ అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ శ్యామ్ బెనర్జీ

తెనాలిఅర్బన్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. షారోన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా శారీరక, మానసిక దృఢత్వం ఏర్పాడుతుందన్నారు. అనంతరం ఆటలు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్‌బెనర్జీ, ప్రిన్సిపాల్ కె.మేరి బెనర్జీ పాల్గొన్నారు.

షాపు లీజుకు బహిరంగ వేలం

తెనాలి టౌన్: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ ఓంకార ఆశ్రమానికి చెందిన గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి గుడి వీధిలోని షాపు లీజుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో హెచ్చుపాటను ఆర్.విద్యాధర్ పాడారు. నెలకు రూ.22వేలు అద్దె చెల్లించే విధంగా పాట పాడినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవదాయశాఖ ఈఓ జి.అమర్‌నాథ్ పాల్గొన్నారు.